## కామెడీ కథ

డా. పేరాల శ్రవణ్‌కుమార్

# టుబూ! ఐ లవ్యూ!

"హల్లో! ఇక్కడ పేరిశాస్త్రిని స్పీకింగు. అక్కడెవరు స్పీకింగూ!" పెళ్లిళ్ల పేరిశాస్త్రి కంగారు కంగారుగా ఫోన్ చేశాడు.

"హాయ్ ప్యారిస్. చీబా హియర్. చెప్పు" సొంత ఇంట్లో ఎఫ్ టీవీలో స్విమ్ సూట్ భామల్ని కన్నార్పకుండా చూస్తూ సెల్ అందుకున్నాడు చిట్టిబాబు.

"ప్యారిస్ ఏంటి మహానుభావా నా పిండాకూడు. నా పేరు పేరిశాస్త్రి" చిరాగ్గా అన్నాడు పేరిశాస్త్రి. ఏదో కాలాన్ని బట్టి నాలుగు ఇంగ్లీషు ముక్కలు తప్పనిసరై మాట్లాడతాడు గానీ పేరిశాస్త్రికి తెలుగన్నా, తెలుగు కల్చరన్నా చాలా ఇష్టం.

"అబ్బ శాస్త్రీ! అమ్మా నాన్న పెట్టిన పేర్లు అలాగే తగిలించుకు తిరగకూడదోయ్. మన టేస్టుకి తగ్గట్టు ట్విస్ట్ చేస్కుని స్టేటస్ పెంచుకోవాలి. చిట్టిబాబుని చీబా ఎందుకయ్యాను? నువ్వు కూడా జంధ్యాల పేరిశాస్త్రికి బదులు 'ప్యారిస్. ఎస్.జంధ్యాల' అని మార్చుకుని చూడు. నీ ప్రాక్టీస్ డబల్ కాకపోతే నన్నడుగు" అన్నాడు విలాసంగా చీబా.

"అయ్యా అదంతా సరే గానీ మీరు పది రోజుల క్రితం ఒక్కరోజు తేడాలో రెండు పెళ్లిచూపులు చూసొచ్చారు. మీకేమైనా గుర్తుందా!"

"ఉంటే?" నిర్లక్ష్యంగా అడిగేడు చీబా.

"ఉంటే ఏంటి లోకనాయకా! ఆ పిల్లల తండ్రులు రోజుకి మూడుసార్లు నాకు ఫోన్లు మీద ఫోన్లు చేసి నా పిండం పెట్టేస్తున్నారు 'అబ్బాయి అభిప్రాయం కనుక్కోవేం' అని. మీరు ఓ పట్టాన చెప్పరు. ఫోటోలు, జాతకాలూ తిరిగి ఇవ్వరు. ఫోన్‌లో దొరకరు. మధ్యలో నేను... నేను నలిగి చచ్చిపోతున్నా జనార్దనా" యాష్ట వెళ్లగక్కేడు శాస్త్రి.

"అబ్బ ప్యారిస్ జంధ్యాలా! శుభమా అని పెళ్లి సంబంధం విషయం మాట్లాడుతూ పిండాలూ, చావదాలూ ఏంటోయ్ నీకు ఈ ప్రాక్టీస్ కన్నా ఆ ప్రాక్టీసే ఎక్కువలా ఉందే" విసుక్కున్నాడు చీబా.

పేరిశాస్త్రి చిట్టిబాబు గారి ఫ్యామిలీ పురోహితుడు. అందుకే కాస్త చనువెక్కువ రెండు పక్కలా. వయసు తేడా కూడా పట్టించుకోడు చిబా, శాస్త్రి దగ్గర.

"అదేమంటే మాట మారుస్తారు. తమరి ధోరణే అర్థం కావడంలా. ఆ సుస్మిత వాళ్ల నాన్నగారైతే నేరుగా మా ఇంటికొచ్చి కూర్చున్నాడు తాడోపేడో తేల్చమని. ఆ నల్గొండ లెక్చరర్‌గారు, అదేనండీ నవ్య వాళ్ల నాన్నగారు ఫోన్లోనే ముక్క చివాట్లు పెడుతున్నారు. మీ గురించి భరించి ఊరుకుంటున్నా. ఇద్దరమ్మాయిలూ కుందనం బొమ్మల్లా ఉంటారు. ఇంజినీర్లు. మీలాగే మంచి జీతాలు. ఎవరో ఒకర్ని సెలెక్షన్ చేసుకుంటే మీ సొమ్మేం పోయింది చెప్పండి. అంటే అన్నానంటారు!" కోపంగా జంధ్యం తిప్పేడు శాస్త్రి.

"నా ప్రాబ్లం నీకర్థం కావడం లేదు శాస్త్రి. ఇద్దరూ అందగత్తెలే. ఇద్దరూ ఇంజినీర్లే. ఒప్పుకుంటాను. కానీ ఒకర్లో ఉన్న ప్లస్‌పాయింట్ మరొకరిలో లేదే! ఫర్ ఎగ్జాంపుల్. సుస్మిత అప్పర్ హాఫ్ అదిరిపోయింది. మరి నవ్య లోయర్ హాఫ్‌లో ఉన్న నిండుదనం అప్పర్ హాఫ్‌లో లేదు. ఇద్దర్నీ కలిసి మిక్సీలో వేసి ఓ ఫిగర్ తయారుచేసి ఇవ్వగలవా చెప్పు. చెప్పు శాస్త్రి!"

"ఏం చెప్పను నా శ్రాద్ధం. ఇన్ని పెళ్లిళ్లు చేశాను. ఇలాంటి ప్రశ్నలెవరూ అడగలేదు నన్ను. పోనీ ఇద్దర్నీ చేసేస్కోకూడదూ! దరిద్రం ఒదిలిపోతుంది?" కసిగా పేలేడు శాస్త్రి.

"నిజానికి అదే కరెక్ట్ సొల్యూషన్. కానీ చట్టం ఊరుకుంటుందా చెప్పు"

"చెప్పుచ్చుకుంటుంది" కసితీరా అన్నాడు శాస్త్రి.

"మరందుకేగా నేనింత డైలమాలో పడిపోయింది. జీవితానికి ఒకే ఒక్క పెళ్లి చేస్కుంటాం శాస్త్రీ. మనకి అన్ని విధాలా పిల్లనచ్చాలా వద్దా?" సముదాయించబోయేడు చీబా.

"అయ్యా నన్ను కలపకండి. ఇది మీ పెళ్లి మాత్రమే. మా కాలంలో ఇలా ఆలోచించామా? ఇలా మాట్లాడేమా. మీ నాన్నగారే ఉంటే మిమ్మల్నిలా మాట్లాడనిచ్చేవారా! ఏదో పెద్దవాళ్లు చెప్పినట్టు విని, సలహా పడి, సంప్రదాయానికి విలువిచ్చి..."

"ఆగాగు శాస్త్రీ. మీ పాతకాలం రోజులు కావోయ్. నేను చూడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నెలకి అరవై వేలు జీతం సంపాదిస్తున్నా. మీ కాలంలో అంతంత జీతాలుండేవా! ఇప్పటికే రెండు కార్లు మార్చా. లోన్స్ ఇస్తామని బ్యాంకుల వాళ్లు క్యూలు కడుతుంటే నాకు నచ్చిన విధంగా ఇల్లు కట్టుకున్నా. అలాంటిది కళ్లు మూస్కుని, అమ్మ, నాన్న చెప్పిన పిల్లకి తాళి కడతానా? నా టేస్టులు నాకుంటాయ్. ఏదో ఫ్యామిలీ పురోహితుడివి కదా అర్థం చేస్కుంటావని చెప్తున్నా అంతే. ఒక్క రెండ్రోజులు వాళ్లిద్దర్నీ ఆపు. ఈలోగా బాగా ఆలోచించి, చివరికి లాటరీ వేసైనా ఇద్దర్లో ఒకర్ని డిసైడ్ చేస్తా. డోన్ట్ వర్రీ" అంటూ ఫోన్ కట్ చేశాడు చీబా.

"ఆ...! డోంట్ వర్రీయే. నీకేం. ఆరడుగుల అందగాడివి. ఐదంకెల జీతగాడివి. ఏదో మీ కుటుంబం మీద అభిమానం కొద్దీ డజను దాకా దివ్యమైన సంబంధాలు తెచ్చాను. పొట్టి అనీ నలుపు అనీ, ముక్కు వంకరనీ ఏదో వంకన ఎన్నో సంబంధాలు కాన్సిల్ చేశావ్. మీ అమ్మగారి బాధ చూళ్లేక ఈ రెండు సంబంధాలూ చెప్తే రెండూ చూసేసి, నిర్ణయం చెప్పకుండా నానుస్తావా? నీకు సంబంధాలు చెప్పినందుకు నన్ను నేను లిబర్టీ షూతో కొట్టుకోవాలి.." మనసులోనే చీబాకి నానా శాపనార్థాలు పెట్టి కాస్త ఉపశమనం పొందేడు శాస్త్రి.

* * *

"ఒరే నాయనా! నీ పెళ్లి నాకు పెద్ద తలనెప్పయిపోయిందిరా. మీ నాన్నగారే ఉంటే నాకీ బాధలుండేవా చెప్పు. ఆ అమ్మాయిల తల్లిదండ్రులు పదేపదే ఫోన్లు చేసి నీ అభిప్రాయం చెప్పమంటుంటే అలా నానుస్తావేంరా" తల్లి వేదనగా మాట్లాడ్తోంది.

"అబ్బ! అమ్మా నిన్నంతా ఆ శాస్త్రి.. ఇవాళ నువ్వు.



ఏవో నా లెఖ్ఖలు నాకుంటాయి. జీవితం మొత్తానికి ఒకే పెళ్ళి. కాస్త ఆగలేరా. రెండ్రోజుల్లో చెప్తానన్నానుగా" తల్లిని విసుక్కుంటుండగా చీబా ఫోను మోగింది. ''అదిరే ...అదిరే ...'' అంటూ.

"రేయ్ చీబా. నేన్రా కోబ్రాని. నీకు చీబా అనే నామకరణం చేసిన నీ బాల్య మిత్రుణ్నిరా"

''నువ్వా. ఇంతకీ ఏంటి సంగతి?'' విసుగ్గా అడిగేడు చీబా.

"ఏం లేదురా. నేనిక్కడే ఓ ప్రైవేటు ప్రాజెక్టులో పనిచేస్తున్నా. మా చెల్లి ఇంజనీరింగ్ చదివింది. జాబొచ్చింది దానికి. నెలకి ఏభై వేలు జీతం. ఇంక పెళ్లి చేసెయ్యాలనుకుంటున్నాం. అమ్మ నాన్న భారమంతా నా మీదే పెట్టేరు. కానీ ఒకటేరా ప్రాబ్లం. పిల్ల సిన్మాస్టార్‌లా ఉంటుంది కానీ హైటేరా ప్రాబ్లం. దాదాపు ఆరడుగులు. అంత పొడుగు పెళ్లికొడుకు కోసం మీటరు బద్ద పుచ్చుకుని గాలిస్తుంటే ఎవరో నీ గురించి చెప్పారు. నిన్నెలా మరిచిపోయానా అని నన్ను నేనే తిట్టుకున్నానుకో. ఒరే ఒరే! ఒక్కసారి మా చెల్లిని చూడరా. చూస్తే ఎగిరి గంతేసి ఒప్పుకుంటావ్. పొడుగు వరుడి కోసం అరుగరుగూ కాళ్లరిగేలా తిరుగుతున్నారా" దీనంగా బుస కొట్టేడు కోబ్రా.

నెమ్మది నెమ్మదిగా కోబ్రా గుర్తుకొచ్చేడు. 'కోవెలమూడి బ్రహ్మానందం' అనీ భలే సరదాగా ఉండేవాడు. అందర్నీ ఆటపట్టించేవాడు. కాలేజీలో కోబ్రాగా ప్రసిద్ధుడు.

"నీకు తెల్సు కదరా కోబ్రా నేనెంత క్యాలిక్యులేటివ్ టైపో. వందసార్లు ఆలోచించనిదే ఏ పనీ చెయ్యను. ఇంటర్‌లో ఎంపీసీ తీస్కునే ముందు ఎంత ఆలోచించానో నీకు తెలుసుగా. అలాగే ఇంజనీరింగ్‌లో చేరే ముందు ప్రతి బ్రాంచి గురించీ క్షుణ్నంగా స్టడీ చేశాకే ఈ బ్రాంచిలో దూరేను. అన్ని యాంగిల్స్లూ టచ్ చెయ్యనిదే ఏ నిర్ణయం తీస్కోను. పెళ్లి విషయంలోనూ అంతే. వాళ్లకి మనం నచ్చినా మనకి వాళ్లు నచ్చాలిగా. చాలామంది అమ్మాయిల్ని డిస్కార్డ్ చేసి పారేశా. ఒకరిద్దరు నా దృష్టిలో ఉన్నారు కానీ ఫుల్ శాటిస్‌ఫాక్షన్ లేదురా. ఏం చెయ్యాలా అని మధనపడుతుంటే నీ ఫోను మోగింది" ఆశగా మరో పెళ్లిచూపులకు రెడీ అయిపోతూ అన్నాడు చీబా.

"అమ్మయ్య. థాంక్స్‌రా చీబా. రేపే వచ్చెయ్. కల్ ఆజా. కమ్ టుమారో" అంటూ అడ్రసు వివరం చెప్పేడు కోబ్రా.

"చూసినవి కాక మళ్లీ పెళ్లిచూపులా. నేన్రానను" తెగేసి చెప్పింది చీబా తల్లి.

"మానెయ్. నేనొక్కణ్నే చూసొస్తా" మొండిగా అన్నాడు చీబా.

★★★

"రారా చీబా రా! మీట్ మై వైఫ్ చీమా" భార్యని పరిచయం చేశాడు కోబ్రా.

"చీమా!" క్వశ్చన్‌మార్క్ మొహం పెట్టాడు చీబా.

"అదేరా. చీమకుర్తి మాధవి. నాకు షార్ట్‌కట్ చెయ్యడం అలవాటు కదా"

లోపలికి వెళ్లిన చీమా ఊరికే రాలేదు. తోడుగా బెల్లమ్ముక్కలాంటి బ్యూటీని తీసికొచ్చింది.

'అబ్బ! విక్రమార్కుడి కత్తిలా ఉంది పిల్ల'

నెమలికంఠం రంగు పట్టుచీరలో మెరిసిపోతున్న ఆ అందాల బొమ్మకేసి తదేకంగా చూస్తూ అనుకున్నాడు చిట్టిబాబు. 'వెదకబోయిన వైరు లెగ్స్‌కే తగులుకోవడం అంటే ఇదే' ఆబగా చూస్తూ మైమరచిపోతు

న్నాడు.

"మీరిద్దరూ పర్సనల్‌గా మాట్లాడుకోవాల్సినవేమైనా ఉంటే మాట్లాడుకోండి. మేమిద్దరం అలా బైటికెళ్లి కాసేపు కాట్లాడుకువొస్తాం" అంటూ చీమాని తీసుకుని వెళ్లిపోయాడు కో(బ్రా.

"చేతబడి చేసే వాడిలా ఏంటా చూపులు? పెళ్లిచూపులన్నారు కదా అని అలా చూపుల్తో గుచ్చెయ్యడమేనా" చిరుకోపంలో చిలిపిదనం రంగరించి తొలి డైలాగ్ పలికింది ఆ అందాల రాశి.

"ఏం చెయ్యను? చూసేకొద్దీ చూడాలనిపిస్తున్నారు. మీదే తప్పు. ఇంతకీ మీ స్వీట్ నేమ్ తెలుసుకోవచ్చా" రొమాంటిగ్గా నవ్వుతూ అడిగేడు చీబా.

"ట బు." ఒక్కో అక్షరం ఒత్తి పలికింది ఆ అమ్మాయి.

ఆ పేరు వినగానే చిబా హార్ట్ పాతిక బీట్లు మిస్ అయ్యింది. చిబా 'టాబూ'కి పిచ్చ ఫ్యాన్. టబు కోసం ట్యాంక్ బండ్ మీదనించైనా దూకేస్తాడు.

"నిన్నే పెళ్లాడుతా" ఠక్కున అనేశాడు ఉద్వేగంగా, ఉల్లాసంగా.

"అబ్బ! పెద్ద నాగార్జున బయల్దేరేడు" చురకత్తి లాంటి నవ్వొకటి విసిరింది టబు.

పర్సనాల్టీకి తగ్గ పేరు. అంతా పెర్‌ఫెక్ట్. ఆమెది ఫిగర్ కాదు ఫైర్. అప్పుడే టబుతో తన పెళ్లయిపోయినట్టూ, టబు, తనూ బాత్ టబ్బులో జలకాలాడుతున్నట్టూ ఊహించుకుంటూ ఉక్కిరిబిక్కిర వుతూ. "మీకా పేరెట్లు వచ్చెను" అన్నాడు స్పెషల్ తెలుగు స్టూడెంట్‌లా. టబుని చూస్తుంటే ఏ భాషలో మాట్లాడ్తున్నాడో కూడా తనకే తెలియడం లేదు.

బదులుగా కిలకిల నవ్వింది టబు. "పూర్తి పేరు టంగుటూరి బుచ్చి మహేశ్వరి. మా అమ్మమ్మ పేరు. ఆవిడలాగే ఓల్డ్‌గా ఉందని కాస్త ట్రిమ్ చేశా. బాలేదా?" ఆమె ఓరచూపు ఒరలోంచి కత్తిలాగినట్టుంది.

"బాలేదా... వాట్ డు యు మీన్. అసలు.. అలా పేర్లు ట్రిమ్ చేస్కునేవాళ్లంటే నాకెంతిష్టమో. నువ్వు, నీ నవ్వు, నీ పేరూ, నీ చీరా, నీ బ్లౌజు..."

"స్టాప్ స్టాప్..." ఇంకే అంటాడో అని భయపడి బ్రేకేసింది టబు.


"అన్నీ... అన్నీ తెగ నచ్చేశాయ్ టబు. ఐ లవ్యూ టబూ." ఆవేశపడిపోయేడు చిబా.



"పెళ్లిచూపులకొచ్చి ఐ లవ్యూ చెప్పేవాళ్లని మిమ్మల్నే చూశాను" చిరుకోపంగా అంది టబు.

"సారీ టబు. ఫీలయ్యావా. అవున్లే. నా మీద నీ ఒపీనియన్ తెలుసుకోకుండా అలా మాట్లాడ్డం నాదే తప్పు" నొచ్చుకున్నాడు చిబా.

"నోనో. మీదేం తప్పు లేదు. ఎందుకంటే తొలిచూపులోనే నా మనసు తొలిచేశారు కాబట్టి" బంగారు మామిడిపిందెల పైటంచు కొసని వేలికి చుట్టుకుంటూ సిగ్గుసిగ్గుగా పలికింది టబు.




ఆ మాటలు వింటుంటే మనసున మల్లెల మాలలూగెనే అని పాడాలనిపిస్తోంది చిబాకి.

"నిజం చెప్పనా టబు. నేనింతకాలం ఎందుకు బ్రహ్మచారిగా ఉన్నానో ఇప్పుడర్థమైంది నాకు. నీలాటి సర్వాంగసుందరి నా నుదుట రాసిపెట్టి ఉంటే యావరేజ్ బ్యూటీలకి ఎందుకు చిక్కుతాను. ఐ యామ్ సో లక్కీ"

"ఆ! ఇక్కడ అలాగే అంటారు. తీరా ఇంటికెళ్లాక మనసు మారిపోతే! జాతకాలు కలవకపోతే? మీ అమ్మగారికి నచ్చకపోతే? తల్చుకుంటేనే భయం వేస్తోంది. మీ లాంటి సూపర్ మ్యాన్ మళ్లీ దొరుకుతాడా" దిగులుగా టబు.

'మాటల్తో మనసులో మన్మథబాంబులు పేలుస్తున్నావ్ కదే' తియ్యని బాధతో మెలికలు తిరిగిపోయేడు చిబా.


"పిచ్చి టబు. అలాంటి డౌట్సేం పెట్టుకోకు. అవన్నీ పిల్ల నచ్చనప్పుడే చెప్పే వంకలు. నీలాంటి రసగుల్లాని చూసిపుడు కాదు. అయినా మా ఇంట్లో నా మాటే ఫైనల్" అంటూ లేచి టబుని సమీపించబోతుండగా స్కూటర్ శబ్దమైంది వాకిట్లో.

"ఏరా! సిగ్గు ఎగ్గు లేకుండా మనసు విప్పి మాట్లాడుకున్నావా?" అంటూ హాస్యాలాడేదు కో(బ్రా వస్తూనే.

"కో(బ్రా బావమ్మర్దీ. నువు చెప్పింది అక్షరాలా నిజంరా. టబు నా కోసమే పుట్టిందిరా. నేనూ తన కోసమే జన్మెత్తేన్రా. ఆ విషయమే డీప్‌గా డిస్కస్ చేస్కుంటున్నాం. అంతలో పానకంలో పుడకలా నువ్వొచ్చే

## నాకంత సీన్ లేదు

ఇటీవల త్రిష ఓ తమిళ చిత్రంలో పాట పాడుతోంది అనే వార్తలు వచ్చాయి. దీని గురించి త్రిష వెంటనే స్పందించింది. 'ఏ.ఆర్.రెహమాన్ నా ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన పాటలంటే చెవి కోసుకుంటాను. నా ఐపాడ్ నిండా ఆయన పాటలే వుంటాయి. అంత మాత్రాన సింగర్‌గా మారిపోతానా? నా టాలెంట్ నాకు తెలీదా? నేను పాడానంటే ఇంకేం లేదు? జనాలు భయపడి పోరూ? ప్రస్తుతానికి అలాంటిదేం లేదు లెండి' అంటూ తను పాటలు పాడడం లేదని తేల్చిపారేసింది త్రిష.




శావ్" అన్నాడు చీబా చిరుకోపంగా.

"సర్లే గానీ రేపే మా అమ్మని తీస్కుని వచ్చేస్తున్నా. కిళ్లీల కోసం... ఐ మీన్ తాంబూలాలు పుచ్చుకోవడం కోసం. బీ రెడీ" అన్నాడు కో్బ్రాకి షేక్ హేండ్ ఇస్తూ.

"అలాగే గానీ కాస్త ముందుగా ఫోన్ చేసి రారా నీ తొందర సంతకెళ్లా" నవ్వుతూ సాగనంపేడు కోబ్రా, కాబోయే బావగార్ని.

ఇంటికి వెళ్లగానే పేరిశాస్త్రి సెల్‌కి కొట్టేడు చీబా.

"నవ్య, సుస్మిత రిజెక్టెడ్. లడ్డు లాంటి టబు సెలెక్టెడ్. ఇదంతా టోటల్లీ అనెక్స్‌పెక్టెడ్. సో... అర్జెంటుగా వచ్చి ఫోటోలూ, జాతకాలూ కలెక్ట్ చేస్కుని రిజెక్టెడ్ క్యాండిడేట్స్‌కి ఇచ్చెయ్. నీకు రావలసిన సంభావన అమ్మనడిగి తీసుకుపో" అంటూ శాస్త్రికి ఆర్డరేశాడు చీబా.

"అమ్మయ్య. ఏదో ఒకటి తేల్చారు. అంతే చాలు" అంటూ నిట్టూర్చేడు శాస్త్రి.

ఆ రోజంతా టబుతో డ్రీమ్ సాంగ్స్‌లో బిజీ అయిపోయేడు చిబా. 'తెలవారదేమో స్వామీ' అని అన్నమయ్య లెవెల్లో రాత్రంతా పాడుకున్నాడు. అతని తపస్సు ఫలించి తెల్లారింది. తెల్లారగానే ఠక్కున ఫోన్ చేశాడు కోబ్రాకి.

కోబ్రా ఇంకా నిద్రోతున్నట్టున్నాడు. టబు కంఠం కలకూజితం చేసింది ఫోన్లో.

"హాయ్ టబూ. మా అమ్మ, నేను కలిసి కాసేపట్లో మీ ఇంటికొస్తున్నాం" అన్నాడు చిబా.

"ఎందుకు?" ఆశ్చర్యం నటించింది టబు.

"అదేంటి అలా అడుగుతావ్. కిళ్లీలు.. ఐ మీన్ తాంబూలాలు పుచ్చుకోడానికి. ఇంక దేనికి?" అన్నాడు చిబా ఉత్సాహం హద్దులు మీరుతుండగా.

"ఆగు చిట్టికన్నా. అంత దూకుడొద్దు. నువ్వు ఎప్పుడు రావాలో, అసలు రావాలో అక్కర్లేదో నే చెప్తాగా"

"అదేంటీ" నీళ్ల మజ్జిగలా నీరసంగా అయిపోయేడు చిబా.

"ఇవాళ మధ్యాహ్నం నన్ను చూస్కోడానికి యు.ఎస్. నుంచి రవిచంద్ర వస్తాడు. రేపేమో కంప్యూటర్ విజార్డ్ శ్రీకాంత్‌తో నా మేరేజ్ లుక్స్. ఇక ఎల్లుండి రిజల్ట్స్. అంటే మీ ముగ్గురి బయోడేటాలు, జీతాల లెఖ్ఖలూ పరికించి, ఎవరి మీసం ఎంత పొడుగో పరిశీలించి అప్పుడు తేలుస్తా నా మొగుడెవడో. ముందుగా చెప్పడానికిదేం మ్యాచ్ ఫిక్సింగ్ కాదు"

బుర్ర తిరిగిపోయింది చిబాకి.

"మరి, నిన్న అంతసేపు మనసులు విప్పి మాట్లాడుకున్నాం. ఐ లవ్యూ అంటే ఐ లైక్యూ అనుకున్నాం. ఇంతలోనే అంత మోసమా! ఇంకో రెండు మ్యాచెస్ చూడబోతున్నట్టు నిన్ననే ఎందుకు చెప్పలేదు. టబూ! ప్లీజ్ టబూ నిన్ను చూడగానే ప్రేమలో పడిపోయా. ఈ దాసుణ్ని మోసం చెయ్యకు. కరుణించు. నిన్ను వీడి బ్రతకలేను" ఫోన్‌లోనే కళ్లనీళ్లు పెట్టేస్కున్నాడు చిబా.

"మరి నువ్వు చేసిందేవిట్రా చీబా. నవ్య ఎవరనుకున్నావ్. నా కజిన్. సుస్మిత కాలేజ్‌లో నా జూనియర్. ఈమధ్య అనుకోకుండా వాళ్లిద్దర్నీ కలిశాను. ఇద్దరూ, ఎవరికి వాళ్లే నీతో సంబంధం సెటిలైపోయిందనుకుని మురిసిపోవడం, ఇద్దరూ స్మార్ట్‌గా ఉన్న నీ ఫోటోనే చూపించి కాబోయే భర్తగా పరిచయం చెయ్యడం చూసి జాలేసింది. నవ్య ఐతే నువు పెళ్లిచూపుల్లో ఎంత రొమాంటిగ్గా మాట్లాడేవో చెప్పి తెగ సంతోషపడిపోయింది. నేను చెప్పాక గానీ వాళ్లిద్దరికీ తెలియలేదు. నువ్వు వాళ్లని పెండింగ్‌లో పెట్టేవనీ, ఇంకా 'ఆలోచిస్తున్నావనీ'. ఏంట్రా ఆలోచించేది. నువు పెద్ద షారుఖ్ ఖాన్‌వా? పేరిశాస్త్రిని గదమాయిస్తే తెలిసింది. ఇద్దరి అందాలూ బేరీజు వేస్తున్నావని. అంత సీనుందా నీకు? నీ చీప్ మెంటాలిటీకి అసహ్యించుకుని వాళ్లిద్దరూ నీకు ఛీకొట్టేక, నీకు గుణపాఠం చెప్పాలనిపించింది. ఆశలు కల్పించి నిరాశ చెయ్యడం అంటే ఎలా ఉంటుందో ప్రాక్టికల్‌గా చూపించాలని ఈ చూపుల తతంగం నడిపేము నేను, కోబ్రా. కోబ్రా సుస్మితకి కజిన్ అవుతాడు. నా పేరు టబూ కాదు. నేను కోబ్రా చెల్లినీ కాదు. నా ఫ్రెండ్ జగ్దీష్‌తో. నా మేరేజ్ ఎప్పుడో ఫిక్స్ అయింది. ఇప్పుడు నీకు నవ్యా లేదు. సుస్మితా లేదు. నేనూ లేను. మళ్లీ మొదలెట్టుకో చూపులు. బై ఫరెవర్" అని షాకిచ్చి ఫోన్ కట్ చేసింది టబు కాని టబు.

"టబూ టబూ టబూ" అంటూ కోపంగా సెల్‌ని బాత్ టబ్బులోకి విసిరికొట్టేడు చిబా.



## టైమ్ బాబూ టైమూ!

తమిళ దర్శకుడు శక్తి చిదంబరం దర్శకత్వం వహించిన దాదాపు అన్ని సినిమాల్లోనూ హీరోయిన్‌గా నటించింది నమిత. ఆయనంటే అంత గౌరవం వున్న ఆమె తాజాగా ఓ చిత్రాన్ని మాత్రం తిరస్కరించింది. ఇందుకు కారణం- ఇందులో హీరోగా లారెన్స్‌ని తీసుకున్నాడు శక్తి చిదంబరం. 'పార్థు' సినిమాలో నటించేటప్పుడు తలెత్తిన ఏదో గొడవ వల్ల అతని పక్కన హీరోయిన్‌గా నటించమన్నాక నటించనని నిర్మొహమాటంగా చెప్పేసిందిట నమిత. అదను చూసి దెబ్బ కొట్టడం అంటే ఇదే! ఎవరి టైము వారికి వస్తుంది మరి!